
సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 25 । మార్చి । 2025



బోరు నీళ్లే దిక్కు

ఆధునిక వసతులు ఉన్నప్పటికీ తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు.


వివరాలు 8లో ▸



చెద.. నిర్లక్ష్యం చేస్తే వ్యథ

చెదలు వ్యవసాయ సాగు పంటలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది.

వివరాలు 8లో ▸



న్యూస్‌రీల్

క్షయవ్యాధి నివారణకు కృషి

డీఆర్‌ఓ పద్మజారాణి



క్షయవ్యాధిపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సంగారెడ్డి: క్షయవ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని డీఆర్‌ఓ పద్మజ రాణి పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ నుంచి డీఎంహెచ్‌ఓ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీబీ వ్యాధిని మొదటిదశలోనే గుర్తించి పూర్తికాలం చికిత్స తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉచితంగా లభిస్తున్న క్షయ నిర్ధారణ పరీక్షలను ఉపయోగించుకొని టీబీ రహిత సమాజానికి కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ అరుణ కుమారి మాట్లాడుతూ.. క్షయవ్యాధి రోగులకు ప్రధానమంత్రి టీబీ ముక్త్ అభియాన్ కింద క్షయ మిత్రల ద్వారా న్యూట్రిషన్ కిట్స్ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి , డీసీహెచ్ఎస్ డాక్టర్ సంగారెడ్డి, డాక్టర్ సంధ్యారాణి, మహేందర్‌రెడ్డి, ప్రసాద్, చక్రపాణి, సిబ్బంది, నర్సింగ్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడితోటలకు రూ.5 లక్షల నష్టం



దెబ్బతిన్న మామిడి కాయలను పరిశీలిస్తున్న ఏఈఓ లావణ్య

మునిపల్లి(అందోల్): అకాల వర్షాలతో మామిడి తోటలకు రూ.5 లక్షల నష్టం వాటిల్లింది. సోమవారం పెద్దచల్మెడ, చిన్న చల్మెడ, అంతారం, కంకోల్ గ్రామాల్లో వ్యవసాయ అధికారులు లావణ్య, రహిమా, సంగీత, ఏఈఓలు పర్యటించారు. మామిడితోటలను పరిశీలించారు. అప్పులు చేసి మామిడి తోటలను కౌలుకు తీసుకున్నామని, అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయామని, తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు. కాగా, దెబ్బతిన్న మామిడి తోటలపై ఉన్నతాధికారులకు పూర్తి వివరాలతో నివేదిక పంపిస్తామని వ్యవసాయ అధికారి లావణ్య తెలిపారు.

ఇక ఆర్టీసీ బస్సుల్లో ఐటీమ్ టికెట్ మిషన్లు



ఐటీమ్ టికెట్ మిషన్లు

నారాయణఖేడ్: ప్రయాణికుల సౌలభ్యం కోసం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఐటీమ్ (ఇంటర్‌నెట్ టికెట్ ఇష్యూయింగ్ మిషన్) టికెట్ మిషన్లు వినియోగించనున్నారు. ప్రస్తుతం వినియోగిస్తున్న టిమ్స్ మిషన్ల ద్వారా కేవలం టికెట్లను మాత్రమే ఇవ్వగలుగుతున్నారు. ఐటీమ్ టికెట్ మిషన్లకు నెట్ కనెక్షన్ ఉండటం వల్ల ప్రయాణికులు ఆన్‌లైన్ పేమెంట్ కూడా చేసే సౌలభ్యం ఉంటుంది. కండక్టర్లకు చిల్లర లావాదేవీల సమస్య కూడా ఉండదు. ప్రస్తుతం సూపర్ లగ్జరీ బస్సుల్లోనే వీటిని వినియోగిస్తున్నప్పటికీ ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అన్ని ఆర్టీసీ బస్సుల్లో వీటిని వినియోగించనున్నారు. ఇప్పటికే డిపోలకు ఐటీమ్ మిషన్లు చేరుకున్నాయి. వీటిపై కండక్టర్లకు అవగాహన కల్పిస్తున్నారు.

ఐఎన్‌హెచ్‌పీసీ రాష్ట్ర కార్యదర్శిగా దత్తారెడ్డి



దత్తారెడ్డిని సన్మానించిన సంఘం రాష్ట్ర బాధ్యులు

నారాయణఖేడ్: ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ (ఐఎన్‌హెచ్‌పీసీ) రాష్ట్ర కార్యదర్శిగా నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటకు చెందిన దత్తారెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో ఈ మేరకు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు నవోదయ సిద్ధు, రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ బాబు దత్తారెడ్డిని శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అందించే పథకాలు అర్హులైన పేదలకు దక్కేలా, మానవహక్కులను పరిరక్షించేలా కృషిచేయాలని వారు సూచించారు. సంఘం రాష్ట్ర బాధ్యులు ఆనంద్, జిల్లా అధ్యక్షులు ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

కల్తీపై కుస్తీ

కట్టడికి 'ఫుడ్ సేఫ్టీ' వాహనం



జిల్లాకు చేరిన ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ వాహనం

జిల్లాలో సంచార ఆహార పదార్థాల ప్రయోగశాల

- రెస్టారెంట్ల వద్దకే వెళ్లి ఆహార పరీక్షలు.. ఆ వెంటనే నివేదికలు
- త్వరలో ప్రారంభిస్తామంటున్న ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: హోటళ్లు, రెస్టారెంట్లను తనిఖీలు చేయడం.. ఆహార పదార్థాల శాంపిళ్లను సేకరించడం.. వాటిని ల్యాబ్‌కు పంపడం.. పరీక్షలు చేయడం.. నివేదికలు రావడం.. ఇలా ఈ ప్రక్రియ అంతా ముగిసే సరికి కొన్ని వారాలు పడుతోంది. అప్పుడు ఆహారం కల్తీ చేసిన వారిపై చర్యలకు ఉపక్రమించేందుకు వీలుంటుంది. కానీ ఇప్పుడు ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం 'ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్'పేరుతో మొబైల్ ల్యాబ్‌ను జిల్లాకు మంజూరు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సాయంతో మంజూరైన ఈ సంచార ఆహార పదార్థాల ప్రయోగశాల వాహనం సంగారెడ్డికి చేరింది. ఈ వాహనం ఉమ్మడి జిల్లా అంతటా తిరుగుతూ రెస్టారెంట్లు, హోటళ్లు, ఆహారం, సంబంధిత సరుకులు అమ్మే రెస్టారెంట్లు, హోటళ్లు, మాల్, దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థల వద్దకు వెళ్లి అక్కడి ఆహార వస్తువులను పరీక్షలు నిర్వహించి వెంటనే నివేదిక ఇస్తుంది. జాతరలు, ఎక్కువ సంఖ్యలో ప్రజలు గుమిగూడే ప్రదేశాలకు వెళ్లి అక్కడ విక్రయిస్తున్న ఆహార పదార్థాలను తనిఖీలు చేయనుంది. ఆహారంతో పాటు, పాలు, వంట నూనెలు, తాగే నీరు ఇలా అన్నింటిని పరీక్షలు చేస్తుంది. ఈ పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన సిబ్బందినికి కూడా నియమించారు. సుమారు 50 రకాల పరీక్షలు నిర్వహించేందుకు వీలుంటుందని ఫుడ్ సేఫ్టీ అధికారులు పేర్కొంటున్నారు.

అన్నింటా కల్తీనే..

ఆహార పదార్థాలు యథేచ్ఛగా కల్తీ జరుగుతోంది. రెస్టారెంట్లు, హోటళ్లు, దుకాణాలు, నిత్యావసర సరుకులు విక్రయించే మాల్స్ ఇలా అనేక చోట్ల ఆహార సంబంధిత వస్తువులు కల్తీ అవుతున్నాయి. వంటనూనెలు, కారం, మసాలాలు, నెయ్యి, పాలు, పప్పుదినుసులు, ఇతర నిత్యావసరాలు చాలా మటుకు కల్తీ అవుతున్నాయి. రెస్టారెండ్లు, హోటళ్లలో విచ్చలవిడిగా ఫుడ్ కలర్స్ వాడుతున్నారు. కంటికి ఇంపుగా కనిపించేలా వాడుతున్న ఈ ఫుడ్ కలర్స్‌తో ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోంది. క్యాన్సర్‌తో పాటు, జీర్ణక్రియకు సంబంధించిన ఆరోగ్యసమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఏదీ కల్తీనో, ఏది నాణ్యమైన సరుకులో తేల్చుకోవడం సామాన్య ప్రజలకు అవగాహన ఉండటం లేదు. దీన్ని ఆసరాగా చేసుకుని ఈ వ్యాపార సంస్థలు అక్రమాలకు పాల్పడుతున్నాయి.

త్వరలో ప్రారంభిస్తాం



ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ వాహనాన్ని త్వరలో ప్రారంభిస్తాం. ఇందులోని పరికరాలు ఫిటింగ్ కావాల్సి ఉంది. ఈ వాహనంలో జీపీఆర్ఎస్ సాంకేతికత ఉంటుంది. ఉమ్మడి జిల్లా అంతటా తిరుగుతూ ఆహార పదార్థాల పరీక్షలు చేసి వెంటనే వచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది. అలాగే ఆహార కల్తీపై రెస్టారెంట్లు, ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తాం.

పి.అమృతశ్రీ,
అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, సంగారెడ్డి

అవగాహనతో పాటు శిక్షణ సైతం

ఈ వాహనాలు కేవలం ఆహార కల్తీలను గుర్తించే పరీక్షలు నిర్వహణకే పరిమితం కాదు. కల్తీలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ఆయా ప్రాంతాల్లో తనిఖీలకు వెళ్లినప్పుడు కల్తీ జరిగినట్లు నిర్ధారణ అయితే వెంటనే అక్కడి ప్రజలకు ఈ కల్తీ గురించి వివరిస్తారు. మరోవైపు కల్తీకి పాల్పడుతున్న వ్యాపార, వాణిజ్య సంస్థలకు సంబం



ధించిన వ్యక్తులకు కల్తీ చేయకుండా శిక్షణ ఇస్తారు. హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహణపై సంబంధిత వ్యక్తులకు శిక్షణ కూడా ఇస్తారని అధికారులు తెలిపారు.

ఏందన్న ఇది..!

- కాంగ్రెస్‌లో చేరలేదని చెబుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- ఇదే అంశం కోర్టులో అఫిడవిట్ సమర్పణ
- ఎమ్మెల్యే తీరును తప్పుబడుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు

పటాన్‌చెరు: పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారన్న అంశం హాట్‌టాపిక్‌గా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. అయితే.. తమ పార్టీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఇందులో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కూడా ఉన్నారు. అయితే.. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేయడంతో సదరు ఎమ్మెల్యేల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. 'అబ్బే.. నేను కాంగ్రెస్‌లో చేరలేదు..''అని కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పేర్కొనడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నావు కదా.. ఇంతకు మనం ఏ పార్టీలో ఉన్నట్లు అని ఆ పార్టీ కార్యకర్తలు నిలదీస్తుంటే.. అది కాంగ్రెస్ జెండా కాదు.. జాతీయ జెండా అని ఎమ్మెల్యే విచిత్రంగా వాదిస్తున్నారని అనుచరులు వాపోతున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే పరిస్థితి కూడా ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్న చందంగా తయారవడంతో ఇటీవల కాలంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు హాజరు కావడం లేదు. అలాగే.. బీఆర్ఎస్‌లో ఉన్నానంటూ ఆ పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఆయన తీరుపై కార్యకర్తలు విస్తుపోతున్నారు. 'ఏందన్నా ఇది'అంటూ కార్యకర్తలు లోలోన కుమిలి పోతున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని, తాము ఏదో ఒక పార్టీ పేరు చెప్పి ప్రజల్లోకి వెళ్లాల్సి ఉందని ఆందోళన చెందుతున్నారు.

నేను కాంగ్రెస్‌లో లేను: గూడెం



మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు ఎమ్మెల్యేగా నాకు అందే వేతనం నుంచి ఐదు వేల రూపాయలు సభ్యత్వ రుసుముగా బీఆర్ఎస్‌కు చెల్లిస్తున్నా. ఇదే విషయం కోర్టుకు నివేదించిన మాట వాస్తవం. అభివృద్ధి పనుల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసినప్పుడు కండువా వేశారు. అంతమాత్రాన కాంగ్రెస్‌లో చేరినట్లు భావించడం సరికాదు. కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనడం లేదు. ఇది అందరికీ తెలిసిందే.

మా దారి మేం చూసుకుంటాం

మాజీ వైస్ చైర్మన్ ఒకరు 'సాక్షి'తో మాట్లాడుతూ తామంతా బీఆర్ఎస్‌లో ఉన్నామనే భావిస్తున్నామని, కాంగ్రెస్ కార్యకలాపాలు చేపట్టడం లేదని చెప్పారు. ఐదేళ్లు వైస్ చైర్మన్‌గా చేసిన సేవలకు గుర్తింపుగా ఇటీవల కొన్ని కాలనీల్లో తనకు పౌర సన్మానం జరిగిందని, ఆ కార్యక్రమాలలో కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్ రంగులతో బ్యానర్ వేయాలా? అని స్థానికులు అడిగితే వారికి జవాబు చెప్పలేక ఇబ్బంది పడ్డామని చెప్పారు. 'ఎమ్మెల్యే గారు కాంగ్రెస్‌లో కొనసాగితే ఇక తాము బీఆర్ఎస్ పక్షాన గట్టిగా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై పోరాటం చేస్తాం అని ఆయన పేర్కొన్నారు. దాదాపు ఎమ్మెల్యే అనుచరులందరిలోనూ ఇదే భావన కనిపిస్తోంది. ఒక తాజా మాజీ చైర్మన్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తాను ఏనాడు కాంగ్రెస్ వాదిని కానని, ఆ పార్టీలో ఇమడలేనని స్పష్టం చేశారు. త్వరలో బీఆర్ఎస్‌లో చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు.

ఏ పార్టీలో ఉన్నావో చెప్పు



కాంగ్రెస్ సభ్యత్వం లేదంటావ్.. మరి ఏ పార్టీలో ఉన్నారో ఎమ్మెల్యే స్పష్టం చేయాలి. ఆయనకు ఓటేసిన ఓటర్లకు పటాన్‌చెరు నియోజకవర్గంలోని 4 లక్షల ప్రజానీకానికి సమాధానం ఇవ్వాల్సి ఉంది. ఆయన ప్రజలను వాడుకుంటున్నారు. వారిని మభ్యపెడుతున్నారు. మోసం చేస్తున్నారు. మేము కూడ అదే అడుగుతున్నాం. ఆయన ఏ పార్టీలో ఉన్నారో తేల్చాలి. తన స్వార్థ రాజకీయాల కోసం ఆయన ప్రజలను మోసం చేస్తున్నారు.

కాటా శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నేత

తెలంగాణలో బీజేపీకి ఆదరణ

- ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే నిదర్శనం
- శ్రమిస్తే అధికారం ఖాయం
- మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు



మాట్లాడుతున్న రామచందర్ రావు, చిత్రంలో అంజిరెడ్డి తదితరులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి ఆదరణ పెరుగుతోందని, కార్యకర్తలు శ్రమిస్తే అధికారం ఖాయమని ఆ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రం సంగారెడ్డిలో సోమవారం ఇటీవలే ఎమ్మెల్సీగా ఎన్నికైన సీహెచ్ అంజిరెడ్డి, మల్క కొమురయ్యలను బీజేపీ ఆధ్వర్యంలో అభినందన సభను నిర్వహించారు. అంతకుముందు సంగారెడ్డిలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి కొత్త బస్టాండ్ మీదుగా పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యావంతులు, మేధావులు సైతం నేడు బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పారు. ఇందుకు ఉదాహరణే ఇటీవలే జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలేనని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా సిట్టింగ్ సీటును కాదని విద్యావంతులు, మేధావులు, ఉపాధ్యాయులు తమ పార్టీకి పట్టం కట్టారన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ పని ఖతం అయిపోయిందని, ఎంపీ ఎన్నికల్లో వారి స్థానాలు గుండు సున్నా కాగా, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కనీసం అభ్యర్థిని కూడా నిలబట్టే సాహసం కూడా చేయలేదన్నారు. ఎమ్మెల్సీలుగా విజయం సాదించిన అంజిరెడ్డి, మల్క కొమురయ్యలు మాట్లాడుతూ ఈ గెలుపును కార్యకర్తలకు అంకితం ఇస్తున్నామని తెలిపారు. తెలంగాణలో కూడా బీజేపీ విజయ పరంపర ప్రారంభమైందని, ఇక రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. సభలో మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి లక్ష్మీనరసయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, ప్రధాన కార్యదర్శి మాణిక్యరావు, అనంతరావు కులకర్ణి, రాజశేఖర్ రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, దేశ్ పాండే తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం 139 ఎకరాలేనట..!

ప్రభుత్వానికి వ్యవసాయశాఖ నివేదిక



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో అకాల వర్షాలకు కేవలం 139 ఎకరాల్లో మాత్రమే పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ తేల్చింది. సదాశివపేట మండలం తంగెడుపల్లి, నాగులపల్లి గ్రామాల పరిధిలో మాత్రమే పంటలకు నష్టం జరిగిందని గుర్తించింది. ప్రధానంగా జొన్న, ఉల్లి, కూరగాయల పంటలకు నష్టం జరిగిందని ప్రాథమిక నిర్ధారణకు వచ్చింది. ఈ రెండు గ్రామాల్లో వడగండ్ల వాన పడినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు సోమవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారులు సోమవారం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక పంపారు. జిల్లాలో ఈనెల 21, 22, 23 తేదీల్లో అకాల వర్షం కురిసిన విషయం విదితమే. ఈదురు గాలులతో కూడిన ఈ వర్షం ధాటికి చాలా చోట్ల జొన్న, ఇతర పంటలు నేలకొరిగాయి. పలు చోట్ల పడిన వడగండ్లతో ఆయా పంటలకు తీవ్ర నష్టం జరిగింది. కానీ అధికారులు కేవలం 139 ఎకరాలు మాత్రమే నష్టం జరిగినట్లు తేల్చడం గమనార్హం.

భోజనంపై భగ్గుమన్న విద్యార్థులు



జేఎన్టీయూ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

జేఎన్టీయూ గేట్ ఎదుట బైఠాయింపు

సంగారెడ్డి: సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ క్యాంపస్‌లో సోమవారం రాత్రి విద్యార్థులు ఆందోళనకు దిగారు. నాణ్యతలేని భోజనం వడ్డిస్తున్నారంటూ కళాశాల గేటు ఎదుట బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాణ్యతలేని భోజనంపై జేఎన్టీయూ ప్రిన్సిపాల్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు విద్యార్థులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ నరసింహను వివరణ కోసం ఫోన్ చేయగా స్పందిచంలేదు.

ఆ గ్రామాలను జిన్నారంలో కలపాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే సునీతారెడ్డి



నర్సాపూర్: నర్సాపూర్ నియోజకవర్గం హత్నూర మండలంలోని పలు గ్రామాలను జిన్నారం మండలంలో కలపాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆమె అసెంబ్లీలో మాట్లాడారు. తన నియోజకవర్గం హత్నూర మండలంలోని రొయ్యపల్లి, నాగారం, షేరిఖాన్‌పల్లి, అక్వంచగూడ గ్రామాలను జిన్నారం మండల కేంద్రానికి దగ్గరగా ఉన్నాయని, వాటిని ఆ మండలంలో కలపాలన్నారు. ఆ గ్రామాల ప్రజలు హత్నూర మండల కేంద్రానికి రావాలంటే 20 కిలోమీటర్ల దూరం రావాల్సి వస్తుందని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని జిన్నారం మండలంలో కలపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రియల్.. ఢమాల్!

సంక్షోభంలో ఎస్టేట్ రంగం

- అమ్ముడుపోని ప్లాట్లు
- దిక్కుతోచని స్థితిలో వ్యాపారులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. దీంతో రియల్టర్లు లబోదిబోమంటున్నారు. జహీరాబాద్‌కు జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి (నిమ్జ్) వచ్చింది. ఈ ప్రాంత రూపురేఖలు మారుతాయి. హుందయ్, వెమ్ తదితర పరిశ్రమలు వస్తున్నాయని ప్రచారం జరగడంతో ఈ ప్రాంతంలోని భూముల ధరలకు రెక్కలొచ్చాయి. పెట్టుబడుదారులు భూముల కొనుగోలుకు ఆసక్తి చూపారు. భూముల క్రయ విక్రయాలు పెరిగాయి. పెట్టుబడులు పెట్టి వెంచర్లు వేశారు. అయితే.. అసెంబ్లీ ఎన్నికల నుంచి ప్లాట్ల అమ్మకాలు జోరు తగ్గింది. వ్యాపారం పడిపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

జహీరాబాద్ ప్రాంతానికి నిమ్జ్ మంజూరుతో అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు రియల్ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయాలుగా విరాజిల్లింది. నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లోని 12.635 ఎకరాల భూమిని నిమ్జ్ ప్రాజెక్టు కోసం సేకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. నిమ్జ్ వల్ల ఈ ప్రాంతంలో పెద్ద పెద్ద పరిశ్రమలు వస్తాయని ప్రచారం జరగడంతో ఒక్కసారిగా బూమ్ వచ్చింది. ధరలు విపరీతంగా పెరిగాయి. రియల్ ఎస్టెట్ వ్యాపారులు భూములను కొనుగోలు చేసి వెంచర్లు వేయడం ప్రారంభించారు. పట్టణం చుట్టూ ఉన్న హుగ్గెల్లి, రంజోల్, హోతి(కె), దిడ్గి, ఖాసీం పూర్, అల్లీపూర్, పస్తాపూర్, హోతి(బి), చిన్న హైదరాబాద్, దిడ్గి, కోత్తూర్(బి), అల్గోల్ తదితర గ్రామాల పరిధిలో వందల ఎకరాల్లో భూముల్లో వెంచర్లు వెలిశాయి. న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్, న్యాల్‌కల్, గంగ్వార్, హుసెల్లి, మెటల్‌కుంట, ఝరాసంగం, రాయికోడ్, కోహీర్, మొగుడంపల్లి మండల పరిధి పలు గ్రామాల్లో కూడా పెద్ద ఎత్తున వెంచర్లు పడ్డాయి. జహీరాబాద్ బైపాస్ రోడ్డుకు ఇరువైపుల పదుల ఎకరాల్లో పంట పొలాలన్నీ వెంచర్లుగా మారాయి. ఇంకా కొత్తగా వెంచర్లు పడుతూనే ఉన్నాయి. పచ్చని పంట పొలాలు వెంచర్లుగా మారడంతో చాలా వరకు భూములు సాగుకు నోచుకోవడం లేదు. పట్టణానికి దూరంగా ఉన్నవి అభివృద్ధి లేక బీడు వారుతున్నాయి.



జహీరాబాద్ బైపాస్ రోడ్డులో వెలిసిన వెంచర్

అమ్ముడుపోని ప్లాట్లు

ఏడాది వరకు జోరుగా ఉన్న వ్యాపారం ఆర్థిక మాంద్యం వల్ల ప్లాట్ల అమ్మకాలు పడిపోయాయి. అప్పులు చేసి భూములు కొని వ్యాపారం ప్రారంభించిన తరువాత ప్లాట్లు అమ్మకాలు తగ్గడంతో తెల్లమోహం వేస్తున్నారు. వడ్డీలు కూడా కట్టలేకపోతున్నామని కొంత మంది రియర్టర్లు వాపోతున్నారు. ధరణి సమస్యలు, డీటీసీపీ వెంచర్ల అనుమతులు, ఎల్ఆర్ఎస్, రిజిస్ట్రేషన్ చార్జీలు. ల్యాండ్ వ్యాల్యూ పెంపులాంటి కారణాల వల్ల అమ్మకాలు 50 శాతం తగ్గిందని చెబుతున్నారు. ప్రభుత్వం పెంచిన పన్నుల ప్రభావం రియల్ దందాపై పడిందని వ్యాపారులు వాపోతున్నారు. ప్రభుత్వం మార్కెట్ వాల్యూ పెంచిన తర్వాత ప్లాట్ల అమ్మకాలు పడిపోయాయని ఏజెంట్లు పేర్కొంటున్నారు. నిమ్జ్‌లో పరిధిలో అభివృద్ధి పనులు ప్రారంభమై కంపెనీ పనులు ప్రారంభమైతే రియల్ వ్యాపారం పుంజుకుంటుందన్న ఆశతో వ్యాపారులు ఉన్నారు.



బీడువారుతున్న వెంచర్ భూములు

క్లుప్తంగా

ఘనంగా స్వామివారి కల్యాణం

- దర్శించుకున్న ఎమ్మెల్సీ సిద్దిపేట, డాక్టర్ యాదవరెడ్డి



కల్యాణోత్సవ వేడుకల్లో యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్‌: శ్రీలక్ష్మీ నరసింహుని కల్యాణోత్సవ పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం తమ అదృష్టమని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని శ్రీగిరిపల్లి గ్రామంలో కొలువుదీరిన స్వయంభూ శ్రీగిరి లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భగవంతుడి ఆశీస్సులు భక్తులపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని కోరుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ చంద్రమోహన్‌రెడ్డి, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, భక్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

– ఎస్పీ పరితోష్ పంకజ్



మాట్లాడుతున్న ఎస్పీ పరితోష్ పంకజ్

పటాన్‌చెరు టౌన్‌: జిల్లాలో పటాన్‌చెరు సబ్ డివిజన్ ప్రాంతాల్లో అధికంగా సైబర్ నేరాలు జరుగుతున్నాయని, దీనిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. సోమవారం సాయంత్రం అమీన్‌పూర్, బొల్లారం పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాల పరిశుభ్రత, స్టేషన్ రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. సులభ మార్గంలో అధిక డబ్బులు వస్తాయనే అత్యాశతో యువత ఆన్‌లైన్ బెట్టింగ్స్, గేమ్స్ ఆడుతూ.. సైబర్ వలలో పడుతున్నారని తెలిపారు. సిబ్బంది ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌తో ముందుకెళ్లాలని సూచించారు. ట్రాఫిక్ రద్దీని అధిగమించడానికి ప్రధాన చౌరస్తాలో ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయాలన్నారు. తరచూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి, అమీన్‌పూర్, బొల్లారం సీఐలు నరేష్, రవీందర్‌రెడ్డి, ఎస్‌ఐలు సోమేశ్వరి, దుర్గయ్య, విజయరావు తదితరుల పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ కోసం జన చైతన్య యాత్ర



మాట్లాడుతున్న ధనలక్ష్మి

నారాయణఖేడ్‌: రాజ్యాంగ పరిరక్షణ కోసం త్వరలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డిల ఆధ్వర్యంలో 'జైబాబు– జై భీం– జై సంవిధాన్ అభియాన్' పేరిట జనచైతన్య పాదయాత్ర నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ రాష్ట్ర సమన్వయకర్త ధనలక్ష్మి తెలిపారు. నారాయణఖేడ్‌లోని ఎమ్మెల్యే సంజీవరెడ్డి నివాసంలో సోమవారం కాంగ్రెస్ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహాత్మాగాంధీ శతాబ్ది జయంతి ఉత్సవాల్లో భాగంగా కార్యక్రమాన్ని పల్లెపల్లెన గడపగడపకూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్య్ర సమరయోధులను, అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని అవమానించేలా కేంద్రంలోని బీజేపీ సర్కారు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గంలోని మండలాల కాంగ్రెస్, అనుబంధ సంఘాల బాధ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బోరు నీళ్లే దిక్కు

వ్యాధుల బారిన తెల్లాపూర్ మున్సిపాలిటీ వాసులు



ఉస్మాన్‌నగర్‌లో సిద్ధమైన మిషన్ భగీరథ ట్యాంక్

- తాగడానికి, స్నానానికి అవే నీళ్లు
- చర్మ వ్యాధులు, హెయిర్ ఫాల్స్‌తో గేటెడ్ కమ్యూనిటీ వాసుల ఆందోళన
- స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని జలమండలికి వినతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నగర కాలుష్యానికి దూరంగా, ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలన్న లక్ష్యంతో ఐటీ, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారస్తులు శివారు ప్రాంతాలలో కోట్లాది రూపాయలతో విల్లాస్, బహుళ అంతస్థుల భవంతులను కొనుగోలు చేసి నివాసముంటున్నారు. ఆధునిక వసతులు ఉన్నప్పటికీ తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. స్వచ్ఛమైన నీరు లేక బోరు నీటిని ఫిల్టర్ చేసుకొని వాటినే స్నానాలకు, ఇతర అవసరాలకు వాడుతున్నారు. ఈ నీటితో స్నానాలు చేయడం వల్ల చర్మ వ్యాధులు రావడంతోపాటు తలపై జుట్టు ఊడిపోతుంది. ఇంత జరుగుతున్నా జల మండలి వారు పట్టించుకోవడం లేదని తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రక్షిత తాగునీరు లేక..

90 శాతం గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లో రక్షిత నీరు లేక తాగునీటి నిత్యం కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. తాగునీటి కోసం డబ్బులు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్మవ్యాధులతో ఇబ్బందులు

కాలనీవాసులు బోరు నీటితో స్నానం చేయడం వల్ల చర్మం రంగు మారడం, పొడిగా మారడంతోపాటు దురదలు వస్తున్నాయి. వాటితో పలు చర్మ వ్యాధులు రావడంతో కాలనీ వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. యుక్త వయస్సు వారి నుంచి ముసలి వారి వరకు తలపై జుట్టు రాలిపోతుంది. ప్రధానం మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యం కోసం వేలాది రూపాయలను ఖర్చు చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణమా..?

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 33 గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు ఉండగా అందులో కేవలం 4 కాలనీలకు మాత్రమే రక్షిత తాగునీటి అందిస్తున్నారు. ఉస్మాన్‌నగర్‌లో 40 లక్షల సామర్థ్యం గల సంపు, 20లక్షల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణంతో 22 కిలోమీటర్లు పైపులైన్ పనులు పూర్తయ్యాయి. కేవలం కాలనీలకు పైపులైన్‌లను కనెక్ట్ చేయాల్సి ఉంది. జలమండలి అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గేటెడ్ కమ్యూనిటీ కాలనీలకు రక్షిత తాగునీటి అందించడం వల్ల ప్రతి నెలా బిల్లుల రూపంలో కోట్లాది రూపాయలు వచ్చే అవకాశం ఉన్నాయి.

చర్మవ్యాధులు వస్తున్నాయి



రక్షిత తాగునీరు సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నాం. ఉన్న బోరు నీటిని ఫిల్టర్ చేసుకొని అవసరాలను తీర్చుకుంటున్నాం. ఆ నీటితో స్నానాలు చేయడంన్లా చర్మ వ్యాధులు వస్తున్నాయి. తలపై జుట్టు ఊడిపోతుంది.

– మదన్ మోహన్ బాబు, ముప్పా ఇంద్రప్రస్థ విలాస్ నివాసి

ఇబ్బందులు పడుతున్నాం



తాగునీరు లేక ఇబ్బందులు తప్పడంలేదు. నిత్యం తాగునీటి కొనుకుంటున్నాం. కాలనీలో వచ్చే బోరు నీటిని వాడుకుంటున్నాం. ఆ నీటితో అనేక వ్యాధులు ప్రబలి అవస్థలు పడుతున్నాం.

– రవీందర్, సైబర్‌కాలనీ

కొనుక్కొని తాగుతున్నాం



నిత్యం తాగునీటిని కొనుక్కొని తాగాల్సిన పరిస్థితి ఉంది. గతంలో బోరు నీటి కారణంగా సుమారు వంద మంది ఇబ్బంది పడ్డాం. బోరు నీటి వలన అనేక ఆరోగ్య సమస్యలు వచ్చాయి. పాలకులు మాకు రక్షిత తాగునీటి అందించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరుకుంటున్నాం.

– రవిరమణ, ఇండస్‌క్రెస్ట్ అపార్ట్‌మెంట్

బోరు నీటితోనే అవసరాలు తీర్చుకుంటూ..

గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లో 90 శాతం బోరు నీటిపైనే ఆధారపడుతున్నారు. బోరు నీటి ట్రీట్‌మెంట్ చేసి ఆ నీటినే స్నానాలకు, ఇతర అవసరాలకు వాడుకుంటున్నారు. వీటి వల్ల ఇళ్లలోని వాషింగ్ మిషన్‌లు, వాటర్ ప్యూరిఫై మిషన్‌లు పాడవుతున్నాయి. స్టీల్ వస్తువులను, ఇంటి నేలను శుభ్రం చేసి వాటిపై మచ్చలు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బోరునీటిను శుద్ధి చేసే ప్లాంట్

శేషవాహనంపై నాచగిరీశుడు

- వైభవంగా బ్రహ్మోత్సవాలు
- నేడు పెద్ద గరుడోత్సవసేవ



నాచగిరి క్షేత్రంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వం చేస్తున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శేషవాహనోత్సవ సేవ వైభవంగా జరిగింది. పట్టువస్త్రాలు, పూలమాలికలు, ఆభరణాలతో విశేషాలంకృతమైన ఆదిశేషుని పడగనీడలో శ్రీనృసింహస్వామివారు లక్ష్మీ సమేతులై ఊరేగారు. శేషవాహనంపై శ్రీవారి వైభవం ప్రత్యక్షంగా తిలకించి భక్తజనులు తరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి పెద్ద గరుడ సేవ జరుగుతుంది. రాత్రి 10 గంటలకు వేడుక ప్రారంభమై ఒంటి గంట వరకు కొనసాగుతుంది. ఈ సందర్భంగా భక్తుల కోసం క్షేత్రంలో తగు ఏర్పాట్లు చేశామని ఈఓ విశ్వనాథశర్మ తెలిపారు.

–వర్గల్(గజ్వేల్):

ప్రయాణికురాలి మెడలోంచి

బంగారం చోరీకి యత్నం

సంగారెడ్డి క్రైమ్: ప్రయాణికురాలి మెడలోంచి గుర్తు తెలియని దుండగులు బంగారం చోరీకి యత్నించిన ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. పట్టణంలోని హనుమాన్ నగర్ (కింది బజారు)కు చెందిన బేగరి శాంతమ్మ (75) ఆదివారం పాత బస్టాండ్ శివారులోని ఆర్యన్ ఫంక్షన్‌లో బంధువుల వేడుకకు హాజరైంది. అనంతరం ఇంటికెళ్లడానికి ఫంక్షన్ హాల్ బయట నిల్చుంది. గుర్తు తెలియని దుండగులు వచ్చి సంగారెడ్డి వైపుగా వెళ్లే ఆటోలో ఎక్కించుకున్న తర్వాత వృద్ధురాలిని మాటల్లో పెట్టి మెడలోంచి ఆభరణాలు చోరీకి యత్నం చేశారు. అప్రమత్తమైన ఆమె కేకలు వేయడంతో బంధువులు రావడాన్ని చూసి దుండగులు పరారయ్యారు. బాధితురాలు శాంతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి



నర్సింలు(ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో మునిగి మత్స్యకారుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధి దొంతి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కట్లె నర్సింలు(45) చేపల అమ్మకం ద్వారా జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం చేపలు పట్టేందుకు స్థానిక కుందలమ్మ చెరువుకు వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి చూడగా నర్సింలుకు సంబంధించి టీవీఎస్ ఎక్సెల్‌తో పాటు బట్టలు, చెప్పులు గట్టుపై కనిపించాయి. సోమవారం ఉదయం చెరువులో గాలించగా మృతదేహం బయటపడింది. చెరువులో చేపల కోసం వేసిన వల నర్సింలు చేతికి చుట్టుకోవడంతో నీటి మునిగి మృతి చెందాడు. మృతుడి తమ్ముడు పోచయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

స్కూటీని ఢీకొట్టిన బస్సు

పటాన్‌చెరు టౌన్ : స్కూటీని బస్సు ఢీకొట్టిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు శాంతినగర్‌కి చెందిన శ్రీనివాసరావు మండల పరిధిలోని రుద్రారం తోషిబా పరిశ్రమ లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం విధులు ముగించుకొని తోటి ఉద్యోగి రాజయ్య గౌడ్‌తో కలిసి స్కూటీ పై పటాన్‌చెరు వైపు వచ్చేందుకు గణేశ్‌గడ్డ చౌరస్తా కు వచ్చారు. ఇస్మాయిల్‌ఖాన్‌పేట్ నుంచి గణేశ్ గడ్డ చౌరస్తాకు వచ్చిన బస్సు వెనుక నుంచి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలు కాగా రాజయ్యకి స్వల్ప గాయాలయ్యాయి. శ్రీనివాసరావు కుమారుడు లోకేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానాలు

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 23 మంది పట్టుబడినట్టు తెలిపారు. వీరిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి రూ. 2 వేలు, 15 మందికి రూ.1,500, మరొకరికి రూ. వెయ్యి జరిమానా విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

సంగారెడ్డి క్రైమ్‌: సంగారెడ్డి పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి పోతిరెడ్డిపల్లి, పాతబస్టాండ్, బైపాస్‌లోని గుర్రపుబొమ్మ వద్ద నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 12 మందిని పట్టుకున్నట్లు ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ తెలిపారు. కోర్టులో హాజరుపరచగా 8 మందికి రూ.2,000, నలుగురికి రూ.1500 జరిమానా విధించినట్లు తెలిపారు.

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా ఒకరికి రెండు రోజులు, మరో వ్యక్తికి ఒక రోజు జైలు శిక్ష విధించారు. మరొకరికి రూ.2 వేలు జరిమానా విధించినట్లు గుమ్మడిదల ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో జీవాలు మృత్యువాత

మూడు గేదెలు



మృత్యువాత పడిన గేదెలు

సదాశివపేట(సంగారెడ్డి): విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి చెందిన ఘటన పట్టణ పరిధిలోని ఎన్‌గార్డెన్ ఫంక్షన్ హాలు సమీపంలోని ఓ వెంచర్‌లో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన రైతు సురేశ్ సదాశివపేట పట్టణంలో నివాసం ఉంటూ గేదెలు మోపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. మూడు గేదెలు మేతకోసం అటుగా వెళ్లి కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే తన గేదెలు మృతి చెందాయని, రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

మొగుడంపల్లిలో మేక

జహీరాబాద్ టౌన్‌: విద్యుదాఘాతంతో మేక మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన మొగుడంపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. మొగుడంపల్లికి చెందిన వడ్డే లక్ష్మయ్య మేకలు మేతకు వెళ్లాయి. ఓ మేక పొలం పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సపోర్టు తీగకు తాకింది. దీంతో కరెంట్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృత్యువాత పడింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పటాన్‌చెరు టౌన్‌: స్కూటీని లారీ ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సంగారెడ్డి ద్వారకా నగర్‌కు చెందిన సాయి దుర్గాప్రసాద్ (25) ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి స్కూటీపై పటాన్‌చెరు మండలం ఇంద్రేశం నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్నాడు. ముత్తంగి స్వీట్ హార్ట్ హోటల్ సమీపంలోకి రాగానే సంగారెడ్డి వైపు వెళ్తున్న లారీ స్కూటీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై సాయి దుర్గాప్రసాద్ మృతి చెందాడు. మృతుడి తల్లి భాగ్యలక్ష్మీ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ మరో యువకుడు



అనిల్ కుమార్(ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్) : అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన మండలంలోని శెట్టిపల్లికలాన్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన పడిగె వెంకట్, స్వరూప దంపతుల ఏకైక కుమారుడు అనిల్ కుమార్(28) వ్యవసాయంతో పాటు పౌల్ట్రీ ఫామ్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవలె వింత వ్యాధితో కోళ్లు మృత్యువాత పడుతుండటంతో పౌల్ట్రీ ఫామ్ సరిగా నడవ లేదు. అలాగే పొలం వద్ద బోర్లు వేస్తే పడలేదు. దీంతో సుమారు రూ.15 లక్షల వరకు అప్పు అయ్యింది. అప్పులు భారంతో మూడు రోజుల కిందట పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రజావాణిలో అర్జీల వెల్లువ

ఇబ్బందులు పడిన జనం



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్‌: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అర్జీలు పెట్టుకొని ఏళ్లు గడుస్తున్నా తమ సమస్యలు మాత్రం పరిష్కారం కావటం లేదని వారు వాపోతున్నారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టరు మాధు. ఇతర అధికారులు హాజరై అర్జీలను స్వీకరించారు. ఈ మేరకు 62 అర్జీలు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని, పెండింగ్ పెట్టరాదని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

నాకు తెలియకుండానే వేరే వారిపై పట్టా



నాకు మా గ్రామంలో మూడు సర్వే నంబర్లలో రెండెకరాల గుంటల భూమి ఉంది. నాకు తెలియకుండానే రెవెన్యూ అధికారులు నా పేరు నుంచి వేరే వారి పేరుపైకి పట్టా మార్చిడి చేశారు. రైతుబంధు డబ్బులు జమ కాకపోవడంతో అధికారులకు అడగగా.. నీ పేరు పై భూమి లేదని సమాధానం ఇచ్చారు. ధరణిలో పరిశీలించగా.. వేరే వారి పేరు నమోదు అయ్యింది. ఆర్టీఐ యాక్ట్ ద్వారా వివరాలు అడుగగా తమ వద్ద ఎలాంటి పత్రాలు లేవని సమాధానం ఇస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని నా భూమి నా పేరు పైకి పట్టా చేయగలరు.

దుర్గారెడ్డి, గ్రామం. రాంసాన్‌పల్లి, అందోల్

ప్రజావాణిలో ఓ వృద్ధుడి అవస్థ



ప్రజావాణిలో తన సమస్య తెలుపుకునేందుకు వచ్చిన ఓ వృద్ధుడు తీవ్ర అవస్థ పడ్డాడు. వెనుకాల ఎవరు రాకపోవటంతో ఏమి చేయాలో తోచక రోదించాడు. పటాన్‌చెరు మండల పరిధిలోని బండ్లగూడ, నేతాజినగర్‌కు చెందిన లక్ష్మారెడ్డిగా చేతిలో ఉన్న దరఖాస్తు ద్వారా తెలిసింది. దరఖాస్తులో తనను కొన్ని సంవత్సరాలుగా ఓ వ్యక్తి చేతబడి ద్వారా వేధిస్తున్నారని, వివిధ రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారని ఉంది. అయితే ఆ వృద్ధుడిని పలకరించగా.. అడ్రసు మాత్రం వికారాబాద్ జిల్లాలోని బంట్వారంగా తెలిపాడు. సమస్య ఏంటని అడగగా ఏమి చెప్పలేకపోయాడు. సాయంత్రం 3 గంటల వరకు అక్కడే నిస్సాహాయస్థితిలో కూర్చొని ఉన్నాడు.

బోరు మోటార్ ఏర్పాటు

మునిపల్లి(అందోల్): వేసవి కాలంలో ప్రజలు తాగునీటి కోసం మంత్రి దామోదర రాజనర్సింహ్మ సహకారంతో బోరు మోటార్ వేస్తున్నట్లు రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని మల్లారెడ్డిపేటలో బోరును వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాధవరెడ్డి, సురేష్, మొగులయ్య, రాములు పాల్గొన్నారు.

మాజీ వీఆర్‌ఓల సంబరాలు

జహీరాబాద్ టౌన్‌: ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన రెవెన్యూ చట్టాన్ని స్వాగతిస్తూ మాజీ వీఆర్‌ఓలు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సంబరాలు చేసుకున్నారు. మాజీ వీఆర్‌ఓలను మళ్లీ రెవెన్యూ శాఖలోకి తీసుకొచ్చినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంచుకున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం తమను జీపీఓలుగా నియమించిందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓల మాజీ అధ్యక్షుడు సంజీవ్‌రావు, మాజీ వీఆర్‌ఓలు శ్రీనివాస్, రాజు, అఫ్జల్, పెంటన్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిగా మార్చండి

జోగిపేట(అందోల్): నియోజకవర్గంలోని అల్లాదుర్గం–మెటల్ కుంటరోడ్డును జాతీయ రహదారిగా ప్రకటించి పునర్నిర్మించాలని జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జోగినాథ్ గుప్తా కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. సోమవారం, మాజీ ఎంపీబీబీ పాటిల్‌తో కలిసి ఢిల్లీలోని కార్యాలయంలో నితిన్ గడ్కరీని కలిసి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలను కలిపే ఈ రోడ్డు గుండా ప్రతిరోజు వేలాది వాహనాలు రాకపోకలు జరుగుతాయని వివరించారు. ఇటీవలి కాలంలో రోడ్డు ధ్వంసమైందని రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు జోగినాథ్ స్థానిక విలేకరులకు తెలిపారు.

చెద.. నిర్లక్ష్యం చేస్తే వ్యథ

- వ్యవసాయ పంటలపై చెద పురుగు
- పూర్తిగా కప్పేసి కాండం పీల్చేస్తున్న వైనం
- ఎండిపోయి గిడసబారిపోతున్న మొక్కలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న మిరుదొడ్డి ఏఈఓ నస్రీన్



మిరుదొడ్డి(దుబ్బాక): చెదలు వ్యవసాయ సాగు పంటలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంటాయి. వివిధ పంటల దిగుబడిపైనే కాకుండా బట్టలు, కొయ్య సామగ్రిని ఆశించిన చెద పురుగులు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయి. ముఖ్యంగా ఆహార పంటలను, నూనె గింజల సాగును, పండ్ల మొక్కలు, అలంకరణ మొక్కలపై చెట్లను ఆశిస్తాయి. అలాగే అడవి జాతి చెట్లను తినేస్తాయి. ఇవి ఎక్కువగా ఎర్ర మట్టి నేలలు, చెల్క నేలల్లో జీవిస్తూ నష్టాన్ని కలిగిస్తాయి. సకాలంలో చెద పురుగులను నిర్మూలించకుంటే తీవ్ర నష్టాలను చవి చూడాల్సి వస్తుందని ఏఈఓ నస్రీన్ తెలిపారు. చెద పురుగులు వ్యవసాయ పంటలను, చెట్లను ఏవిధంగా ఆశించి నష్టపరుస్తాయి, వాటి నివారణకు చేపట్టాల్సిన విధి విధానాలు ఆమె మాటల్లో...

నాలుగు రకాల తెగలు

చెద పురుగులు పుట్టల్లో చాలా వరకు సామూహికంగా జీవిస్తాయి. వాటిలో నాలుగు రకాల తెగలు ఉన్నాయి. రాజు, రాణి, పని చేసే చెద పురుగులు, సైనిక చెద పురుగులు అనే తెగలు ఉన్నాయి.

సంతతి పెంచుకుంటాయి

రాణి, రాజు పురుగులు రెక్కలను కలిగి ఉంటాయి. ఇవి వేసవి కాలంలో పుట్టలో ఉండి జీవిస్తాయి. తొలకరి వర్షాలు పడ్డప్పుడు రాణి, రాజు పురుగులు పుట్టనుంచి బయటకొచ్చి సంపర్కం జరుపుతాయి. అనంతరం గుడ్లు పెట్టడం ప్రారంభించి రోజుకు సుమారు 30 వేల నుంచి 80 వేల వరకు పెడుతాయి. గుడ్ల నుంచి పిల్ల పురుగులు నెల నుండి మూడు నెలలలోపు బయటకు వస్తాయి. పిల్ల పురుగులు పెద్ద పురుగులుగా మారడానికి సంవత్సర కాలం పడుతుండటం విశేషం. పని చేసే పురుగుల కంటే సైనిక పురుగులు పెద్దవిగా ఉండి రెక్కలు లేకుండా ఉంటాయి.

నివారణ చర్యలు ఇలా

- పంట పొలాల్లో ఉన్న చెద పురుగుల పుట్టలను పూర్తిగా తవ్వివేయాలి. పుట్టలో ఉన్న తల్లి పురుగును గుర్తించి పూర్తిగా నిర్మూలించాలి. లేదా 5 మిల్లీ లీటర్ల క్లోరిపైరిఫాస్ మందును లీటర్ నీటిలో కలిపి చెద పుట్టలు పూర్తిగా నానేట్లు తడుపుకోవాలి.
- చెద పురుగులు ఉన్న ప్రాంతాలను గుర్తించి కిలో వేరు శనగ విత్తనాన్ని 6.5 మి. లీ. క్లోరిపైరిఫాస్‌తో విత్తన శుద్ధి చేసి నీడలో ఆరబెట్టుకోవాలి. అలా ఆరబెట్టిన విత్తనాలను మరుసటి రోజు విత్తుకోవాలి.
- చెరకు గడలను లీటర్ నీటికి 2.0 మి.లీ మాలథియాన్ 0.1 శాతం ద్రావణంలో 15 నిమిషాలు నానబెట్టిన తర్వాత విత్తుకోవాలి.
- పండ్ల తోటల్లో మొక్కలను నాటే గుంతల్లో మిథైల్ పెరాథియాన్ పొడి మందును 100 గ్రాముల మోతాదు వేసుకోవాలి. ఏపుగా పెరిగిన చెట్ల మొదళ్లకు కోల్‌తార్ ద్రావణం పూయటం వల్ల చెద పురుగులను పూర్తిగా అరికట్ట వచ్చు.

ఈ విధంగా నష్ట పరుస్తాయి

పని చేసే పురుగులు పంట పొలాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. పంట మొక్కల కాండాలను ఆశించి లోపలి పదార్థాన్ని తింటాయి. అలా తినడం వల్ల కాండంలో ఖాళీ ప్రదేశాలు ఏర్పడుతాయి. అక్కడ మట్టిని నింపుతాయి. ఇట్టి మొక్కలు మొదట పూర్తిగా వడలిపోయి ఎండుముఖం పడుతాయి. అనంతరం మొక్కలు చనిపోయి దిగుబడి తగ్గిపోతుంది. నీటి ఎద్దడి కలిగి ఉన్న పండ్ల తోటల్లో ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. పండ్ల మొక్కలను, అటవీ మొక్కల బెరడును తింటూ మట్టితో కప్పి పెడతాయి. దీంతో పండ్ల మొక్కలు పూర్తిగా గిడసబారి పోతాయి.



మామిడి చెట్టును మట్టితో నింపిన చెద పురుగులు